# సుందరం..'సుమ'ధురం



పోతురెడ్డిపాలెం సమీపంలో ఆహ్లాదాన్నిస్తున్న తురాయి చెట్టు



16వ నంబరు జాతీయ రహదారిపై రేగుపాలెం వద్ద కనువిందు చేస్తున్న తురాయి చెట్టు

**యలమంచిలి రూరల్ :** ఇది మధుమాసమా..అవుర ఎంత మనోహరమెందు జూచినన్...అంటూ ఓ మహాకవి అబ్బురపడినట్టు ఈ వసంత కాలంలో సుందర సుమాలు కనువిందు చేస్తున్నాయి. సంధ్య వేళ సింధూర కాంతులు విరజిమ్మినట్టుగా తురాయి పూలు మది పులకింపజేస్తున్నాయి. అనకాపల్లి-పాయకరావుపేట వరకు 16వ నంబరు జాతీయ రహదారికి ఇరువైపులా ఎర్రని కుంకుమ విరబూసిన తురాయి పూల సోయగాలివి. ఆ దారిన వెళుతున్న ప్రయాణికులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

## క్లుప్తంగా

### అభినయ గేయాలతో భాషపై పట్టు



అభినయ గేయాలు ఆలపిస్తున్న విద్యార్థులు

**అచ్యుతాపురం :** భాషలు నేర్చుకోవడంతో అభినయ గేయాల పాత్ర చాలా కీలకమని తిమ్మరాజుపేట హెచ్‌ఎం మారిసెట్టి వెంకట అప్పారావు అన్నారు. అచ్యుతాపురం శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా గురువారం ఆయన విద్యార్థులకు ఆంగ్ల రైమ్స్ అభినయ గేయాలు పలికించడం జరిగింది. భాష పట్ల అవగాహన, ఆసక్తి పెరిగేందుకు ఈ అభినయ కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

### అభయాంజనేయ స్వామి జయంతి వేడుకలు రేపు

**మునగపాక :** మండల వ్యాప్తంగా జూన్ 1న అభయాంజనేయస్వామి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఆలయాలను పలు రంగులతో అలంకరించారు. మునగపాకలోని సంత బయిల అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన జరుగుతుందన్నారు. గవర్ల అనకాపల్లిలో కూడా అభయాంజనేయ స్వామి జయంతి వేడుకలను నిర్వహించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

### భక్తిశ్రద్ధలతో పైడితల్లి అమ్మవారికి పూజలు



భక్తులకు దర్శనమిచ్చిన పైడితల్లి అమ్మవారు

**రాంబిల్లి:** మామిడివాడలో గురువారం పైడితల్లి అమ్మవారి అనుపు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఈ సందర్భంగా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు.

### ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం



పతాకావిష్కరణ చేస్తున్న దృశ్యం

**అచ్యుతాపురం :** మండల కేంద్రంలో గురువారం సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి కె.సోమునాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు కె.రాము చేతుల మీదుగా పతాకావిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ సీఐటీయూ ఆవిర్భావం, ఆవశ్యకత, లక్ష్యాలు, సాధించిన విజయాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మనమ్మ, శ్రీరాములు,కార్మికులు పాల్గొన్నారు.

### విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు



సచివాలయ సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు

**కోటవురట్ల :** విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు హెచ్చరించారు. బి.కె.పల్లి గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసిన ఆయన రికార్డులు పరిశీలించారు. ఈ–సేవల వివరాలు, ఉద్యోగులు హాజరు విధానాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ–సేవలను మరింతగా మెరుగుపరచాలన్నారు. వివిధ సేవలపై వచ్చేవారి పట్ల స్నేహపూర్వకంగా స్పందించాలన్నారు. ప్రతి ఉద్యోగి విధులకు హాజరైనపుడు, వెళ్లేటపుడు హాజరు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## కౌంటింగ్ సందర్భంగా ఘర్షణలకు పాల్పడితే చర్యలు



రేబాకలో ప్రజలతో మాట్లాడుతున్న సీఐ విజయ్‌కుమార్

**నక్కపల్లి :** వచ్చే నెల 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల లెక్కింపు పురస్కరించుకుని గ్రామాల్లో ఎటువంటి ఘర్షణలకు పాల్పడినా కేసులు నమోదు చేస్తామని సీఐ విజయ్‌కుమార్ హెచ్చరించారు. గురువారం ఆయన రేబాక, రమణయ్యపేట గ్రామాల్లో ప్రజలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ పూర్తయ్యేవరకు గ్రామాల్లో సెక్షన్ 30 అమల్లో ఉందన్నారు. విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు, బాణా సంచా కాల్చడం వంటివి చేయరాదన్నారు. వివిధ పార్టీలకు చెందిన వారు సంయమనం పాటించాలని ఎటువంటి కవ్వింపు చర్యలకు పాల్పడరాదన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలన్నారు.

## 2న ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

**మునగపాక :** మునగపాకలో జూన్ 2న ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు సాయిబాబా ఆలయ కమిటీ చైర్మన్ బొడ్డేడ వీరేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో విశాఖకు చెందిన శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిబిరం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వీరేంద్ర కోరారు.

## పుస్తక పఠనంతో విద్యార్థులకు మేలు



దిమిలి గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

**రాంబిల్లి:** దిమిలి శాఖా గ్రంథాలయంలో గురువారం వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం కొనసాగింది. విద్యార్థులకు పుస్తక పఠనంతో కలిగే ప్రయోజనాలను రిసోర్స్‌పర్సన్ జి. నూకినాయుడు వివరించారు. నీతికథల్లో నీతిని విద్యార్థులు గ్రహించి పాటించాలన్నారు. అనంతరం విద్యార్థులతో పలు రకాల ఆటలను ఆడించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎస్.శకుంతల పాల్గొన్నారు.

## హనుమజ్జయంతికి ఘనంగా ఏర్పాట్లు



అభయాంజనేయస్వామివారి ఆలయం

**నక్కపల్లి :** మండల కేంద్రంలో ఉన్న అభయాంజనేయస్వామివారి ఆలయంలో జూన్ ఒకటో తేదీ శనివారం హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఎంతో ప్రాముఖ్యం గల ఆంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతిని ప్రతి ఏటా ఘనంగా నిర్వహిస్తారు. ఉదయం నుంచి ఆలయంలో హోమాలు, తమలపాకు పూజలు, సింధూర పూజలు జరుగుతాయి. జాతీయ రహదారిపై పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ఆలయంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకుని జరిగే పూజాది కార్యక్రమాలకు మండలంలో వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివస్తారు. ఈ సందర్భంగా అన్న సమారాధన జరుపుతారు.

## ఉత్సాహంగా వేసవి శిబిరాలు



విద్యార్థులకు మ్యూజికల్ చైర్ ఆడిస్తున్న దృశ్యం

**పాయకరావుపేట :** పట్టణంలోని గ్రంథాలయంలో వేసవి శిబిరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. గురువారం విద్యార్థులకు రామాయణంలోని సుందరకాండ గురించి ఉపాధ్యాయుడు సీతారామమూర్తి తెలిపారు. అలాగే డైరీ రాయడం, ఇంగ్లిష్‌లో మాట్లాడడం, భగవద్గీత పారాయణం వంటి అంశాలను వివరించారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయుడు అచ్యుతరావు విద్యార్థులకు మ్యూజికల్ చైర్ ఆటలు నిర్వహించారు.

## మహిళలకు ఉచిత టైలరింగ్, బ్యూటీపార్లర్‌పై శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న శచీదేవి

**అనకాపల్లి :** మహిళలు స్వశక్తితో ఎదగాలని, ఆర్థికంగా బలపడితే కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని డీఆర్‌డీఏ పీడీ శచీదేవి అన్నారు. స్థానిక పూడిమడక రహదారి భారతీయ స్టేట్‌బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్, బ్యూటీ పార్లర్‌పై శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ డ్వాక్రా గ్రూపు సంఘాలలో చేరాలని తద్వారా శిక్షణ అనంతరం యూనిట్ స్థాపించుకోవడానికి తగిన ఆర్థిక సహాయం ద్వారా డ్వాక్రా రుణం పొందవచ్చని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా, ప్రైవేట్ ఉద్యోగాల ఒత్తిడి కారణంగా స్వయం ఉపాధి అనేది ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. మహిళలకు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. సంస్థ డైరెక్టర్ బి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ టైలరింగ్, బ్యూటీపార్లర్ శిక్షణ 30 రోజులు ఉంటుందని, శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి, రెండు జతల యూనిఫాం, టూల్‌కిట్స్, బ్యాంక్‌ల ద్వారా రుణాలు, పర్సనల్ డెవలప్‌మెంట్ వంటి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏపీడీ డైనీ, మహిళలు పాల్గొన్నారు.

## స్థిరంగా కూరగాయల ధరలు

**కశింకోట:** కశింకోటలోని వారపు సంతలో గురువారం కూరగాయలు దాదాపు స్థిర ధరలకు అమ్మకాలు సాగాయి. కిలో ఉల్లిపాయలు, బంగాళాదుంపలు రూ.30, టమాటా, దొండకాయ, బీట్రూట్, క్యారెట్, బెండకాయ, వంకాయ రూ.40, బీరకాయ, కాకరకాయ, కీరదోస రూ.60కి విక్రయాలు సాగాయి.

# విజయోత్సవాలకు సిద్ధంగా ఉండండి

- 9న సీఎంగా మళ్లీ జగన్ ప్రమాణ స్వీకారం ఖాయం
- వైఎస్సార్‌సీపీ శ్రేణుల సమావేశంలో మలసాల భరత్‌కుమార్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్



సమావేశానికి హాజరైన కశింకోట మండలం వైఎస్సార్‌సీపీ శ్రేణులు

**అనకాపల్లి :** ప్రశాంతమైన వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు జరిగాయని, జూన్ 4న ఫలితాల్లో విజయఢంకా మోగించి మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ కేంద్రంగా ప్రయాణ స్వీకారం చేయం, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను 12వేల మెజార్టీతో గెలుపు ఖాయమని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో కశింకోట మండల పార్టీ అధ్యక్షుడు మలసాల కిషోర్ ఆధ్వర్యంలో గురువారం మండల పరిధి నాయకులు, కార్యకర్తలు, అభిమానుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ముగిసిన తరువాత తమ సొంత పనులు నిమిత్తం హైదరాబాద్ వెళ్లడం జరిగిందని, ప్రతిపక్షాలు ఎన్నో విమర్శలు చేసినప్పటికీ కార్యకర్తలు ధైర్యంగా వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం కృషి చేశారన్నారు. రాజకీయ కుటుంబ చరిత్ర కలిగిన తనను నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించారని పేర్కొన్నారు. జనవరి 2వ తేదీ నుంచి నియోజకవర్గ ప్రజలు, నాయకులు, కార్యకర్తలు అండగా ఉండడంతో గడప గడపకు సార్వత్రిక ఎన్నికల్లో ప్రచార కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, ఎన్నికల ఫలితాలు విడుదలైన వెంటనే మరోసారి నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన ప్రతి వ్యక్తికి గుర్తింపు ఉంటుందని, జూన్ 4న రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో విజయోత్సవాలకు పార్టీశ్రేణులు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపు నిచ్చారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందని, మహిళలు, వృద్ధులు, యువత సైలెంట్‌గా పోలింగ్ బూత్‌ల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని గెలిపించాలని ఆశీర్వదించినట్టు చెప్పారు. జూన్ 9న విశాఖ కేంద్రంగా మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రయాణస్వీకారం చేస్తున్నారని, నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపు నిచ్చారు. అంతకుముందు పార్టీ సీనియర్ నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో కశింకోట ఎంపీపీ కలగా లక్ష్మీగున్నయ్యనాయుడు, జెడ్పీటీసీ దంతులూరి శ్రీధర్‌రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కరక సోమునాయుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నీటిపల్లి లక్ష్మి, విశాఖ డెయిరీ డైరెక్టర్ రమణారావు పాల్గొన్నారు.

## దేవాలయాల అభివృద్ధికి విరాళాలు



మునగపాక పరదేశమ్మ తల్లి గుడికి విరాళం అందజేసిన నాగయ్య కుటుంబ సభ్యులు



మూలపేటలోని గంగాలమ్మ తల్లి గుడి నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దృశ్యం

**మునగపాక :** మండలంలోని పలు దేవాలయాలకు భక్తులు విరాళాలు అందజేస్తున్నారు. ఆలయ నిర్మాణాల్లో తాము కూడా భాగస్వాములమవుతామంటూ తమకు తోచిన సాయాన్ని అందజేస్తున్నారు. మునగపాకలోని పరదేశమ్మతల్లి గుడి అభివృద్ధికి మలేషియాలో ఉంటున్న మునగపాకకు చెందిన టెక్కలి నాగయ్య కుటుంబ సభ్యులు గతంలో రూ.70వేలు అందజేశారు. గురువారం అమ్మవారిని దర్శించుకున్న నాగయ్య కుటుంబ సభ్యులు మరో రూ.50 వేలను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో పెద్దలు టెక్కలి పరశురాం, బొడ్డేడ అప్పలనాయుడు పాల్గొన్నారు. మండలంలోని మూలపేటలోని గంగాలమ్మ తల్లి గుడి నిర్మాణానికి మునగపాకకు చెందిన దాడి నీరునాయుడు కుమారుడు జగన్నాథరావు, గంగ కృష్ణకుమారి దంపతులు రూ.10,116 విరాళంగా ఆలయ నిర్వాహకులు భీశెట్టి గంగప్పలనాయుడు, కాశీలకు అందజేశారు.

## భానుడి ప్రతాపానికి రోడ్లు నిర్మానుష్యం



నిర్మానుష్యంగా మునగపాక మెయిన్‌రోడ్డు

**మునగపాక :** మండల వ్యాప్తంగా గురువారం సూర్యుడు చుర్రుమనిపించాడు. ఉదయం నుంచి ఎండ తీవ్రత పెరిగిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కొద్ది రోజులుగా వేడిగాలులతో సతమతమయ్యే ప్రజలు గురువారం కూడా అవస్థలు పడాల్సి వచ్చింది. ఉదయం 9 గంటలకే ఎండ వేడిమి పెరిగిపోయింది. సాయంత్రం 4 గంటలకు కూడా వేడి తగ్గలేదు. దీంతో వృద్ధులు, ,పిల్లలు ఇబ్బందులు పడ్డారు. రాకపోకలు సాగించేవారు తమకు అందుబాటులో ఉండే గొడుగులు, రుమాళ్లు కప్పుకొని ప్రయాణించారు. దీంతో మునగపాక మెయిన్‌రోడ్డు ఉదయం 11 గంటలకే నిర్మానుష్యంగా మారింది. ఒకవైపు రుతుపవనాలు వచ్చేస్తున్నాయంటూ అందుతున్న సమాచారానికి ప్రస్తుతం ఎండలకు ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

## సొంత నిధులతో చేతిబోరుకు మరమ్మతు



రామచంద్రపురంలో చేతిబోరుకు మరమ్మతు చేస్తున్న దృశ్యం

**కోటవురట్ల :** వేసవి ఎండలు మండిపోతున్నాయి. ఉష్ణోగ్రతలు తారస్థాయికి చేరుకుంటున్నాయి. వడగాడ్పులు వీస్తున్నాయి. వర్షాలు పూర్తిగా ముఖం చాటేశాయి. దాంతో భూగర్భ జలాలు అడుగంటి తాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. పల్లెల్లో చేతిబోర్లు మొరాయిస్తున్నాయి. రామచంద్రపురంలో పదిరోజుల క్రితం చేతిబోరు మూలకు చేరింది. దాంతో ఆ వీధిలోని వారు మంచినీటికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సమస్యను సర్పంచ్ చవ్వాకుల కుమారి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది చర్యలు తీసుకోకపోవడంతో వైఎస్సార్‌సీపీ నాయకుడు చవ్వాకుల చిన్న తన సొంత నిధులతో బుధవారం మరమ్మతు చేయించి తాగునీటిని పునరుద్ధరించారు. స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**యలమంచిలి రూరల్ :** విద్యుత్ సంబంధిత మరమ్మతు పనుల కారణంగా పురుషోత్తపురం, యలమంచిలి సబ్‌స్టేషన్ల పరిధిలో కొన్ని ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. పురుషోత్తపురం ఫీడర్ పరిధిలో పురుషోత్తపురం, పోతురెడ్డిపాలెం, రుక్మిణీపురం, రేగుపాలెం, వెంకునాయుడు పాలెం, రామభద్రపురం, లైను కొత్తూరు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు. ఈ గ్రామాల పరిధిలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు ఉదయం 4 గంటల నుంచి 7 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. రాంబిల్లి ఫీడర్ పరిధిలో ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సోమలింగపాలెం, కట్టుపాలెం, రామారాయుడుపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. యలమంచిలి, ఎర్రవరం, కొత్తపాలెం వ్యవసాయ కనెక్షన్లకు ఉదయం 4 గంటల నుంచి 7 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. అవకాశం ఉన్న చోట్ల ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులంతా గమనించి సహకరించాలని ఆయన కోరారు.

## విస్తృతంగా వాహనాల తనిఖీ



కశింకోటలో పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు, కారు



కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమంలో పాల్గొన్న పోలీసు సిబ్బంది

**కశింకోట:** కశింకోటలో సరైన రికార్డులు లేని 46 బైకులను, కారు, ఆటోలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ ఎం. వినోద్‌బాబు, ఎస్‌ఐ రమేష్ బాబు, అలీల ఆధ్వర్యంలో సిబ్బంది గ్రామంలోని గవరపేట, హౌసింగ్ కాలనీ, జాషువా కాలనీ, ఎస్సీ కాలనీ, సత్తెమ్మ కాలనీ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేశారు. ఆ సమయంలో సరైన రికార్డులు లేని బైక్‌లను, కారు, ఆటో స్వాధీనం చేసుకొని పోలీసు స్టేషన్‌లో భద్రపరిచారు. వీటికి రికార్డులు ఉంటే ఆధారాలు చూపి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా సీఐ కోరారు. ఇళ్ల ముందు పెట్టే బైక్‌లు దొంగతనాలకు గురి కాకుండా వాటికి పటిష్టవంతంగా లాక్‌లు వేసుకొని భద్రపరచుకోవాలని వాహన చోదకులకు సూచించారు.

## సత్వరం రహదారి పూర్తి చేయాలి

**అనకాపల్లి :** స్థానిక జలగల మదుం జంక్షన్ పెట్రోల్‌బంక్ వద్ద రహదారిని త్వరితగతిన పూర్తిచేసేందుకు జీవీఎంసీ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని సిద్దార్థా సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం గురువారం ఒక ప్రకటనలో కోరారు. జీవీఎంసీ అధికారులు రెండు లైన్లు రహదారిని పట్టణ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని నాలుగులైన్లు రహదారిగా విస్తరించడం శుభపరిణామమని, అనకాపల్లి నుంచి జాతీయ రహదామీదుగా విశాఖకు వెళ్లే సమయంలో పెట్రోల్ బంకు వద్ద రహదారి వేయకపోవడంతో పెద్దపెద్ద గోతులతో భారీ వాహనాలు, బస్‌లు, కారులు, ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాహనాలు మరమ్మతులకు గురౌవుతున్నాయని, వర్షాలు కురవకుముందే రహదారిని అభివృద్ధి చేయాలని ఆయన కోరారు.

## నిబంధనలు పాటించని వాహనాలపై కేసులు

**తుమ్మపాల:** నిబంధనలు ఉల్లంఘించి రోడ్లపై ఓవర్‌లోడ్‌తో ప్రయణించే వాహనాలపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తామని జిల్లా రవాణా శాఖ అధికారి కె.వి.ప్రకాష్ అన్నారు. పట్టణంలో అచ్యుతాపురం రోడ్డుపై గురువారం రవాణా శాఖ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అధిక సంఖ్యలో వాహనాలకు జరిమానాలు విధించారు. రెండు రోజులుగా చేపట్టిన డ్రైవ్‌లో రూ.10 లక్షల వరకు జరిమానాలు వేశామన్నారు. అనకాపల్లి-అచ్యుతాపురం రహదారిలో పరిమితికి మించి వాహనాలు అధిక బరువుతో రాకపోకలు చేస్తున్నాయన్నారు. అలాంటి వాహనాలపై జరిమానాలు వేస్తున్నామని, వారిలో మార్పు రాకపోతే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

## బ్యాంకు ఖాతాల్లోనే పింఛను జమ

- 3,008 మందికి ఇంటి వద్ద పంపిణీ

**మాడుగుల రూరల్:** అవ్వతాతలకు ప్రతి నెల అందించే పింఛన్లు ఈ నెల్లో కూడా బ్యాంకు ఖాతాలకు జమ చేయనున్నట్లు స్థానిక ఎంపీడీవో ఆర్.కాశీప్రసాదరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని 11,929 మంది పింఛనుదార్లకు గాను రూ.3.58 లక్షలు మంజూరైనట్లు వెల్లడించారు. ఇందులో 3,008 మంది వృద్ధులు, దీర్ఘకాలిక రోగులు, దివ్యాంగులు, వీల్‌చైర్‌కి పరిమితమైన వారికి రూ.90.21 లక్షల నగదును 5వ తేదీలోగా సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్ మొత్తాన్ని అందిస్తారని తెలిపారు. మిగిలిన 8,921 మందికి సంబంధించి రూ.2.68 కోట్లను జూన్ 1న పింఛనుదార్ల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు పేర్కొన్నారు.